**చురక**

కుటుంబ రాజకీయ
కుత్సితాల ప్రేలాపన
తమ పార్టీలో లేనట్లు
తైతక్కల ఆలాపన.

రాజ్యాంగం కల్పించిన
రాజకీయ హక్కే కదా
సమస్యైతే సర్కారు
సవరిస్తే సమసిపోదా



-వేల్పుల నారాయణ

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 9-4-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:188 పేజీలు:6 వెల: రూ.1/-


## రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 8:రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రేపటి నుంచి శ్రీ క్రోధి నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరంలో ప్రజలకు శుభం కలగాలని, ప్రజల ఆశలు ఆకాంక్షలన్నీ నెరవేరాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, రైతుల రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని అభిలషించారు. నూతన సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి, దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

# రైతుల పేరిట దొంగ దీక్షలు.. మంత్రి శ్రీధర్ బాబు



కరీంనగర్, ఏప్రిల్ 8: పదేళ్ల బారాస పాలనలో రైతులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని, పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రైతుల పేరిట బీఆర్ఎస్ నేతలు దొంగ దీక్షలు చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆరోపించారు. సోమవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగింది తప్ప పెద్దపల్లి జిల్లాకు చుక్క నీరు రాలేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఎంతో మంది రైతులు భూములు, ఉపాధి కోల్పోయారన్నారు. పదేళ్లపాటు రైతుల కష్టాల గురించి ఆలోచించని బారాస నేతలు రైతుల పేరిట దొంగ దీక్షలు చేయడం సిగ్గుచేటన్నారు.

జిల్లాలో రైతులు పండించిన పంటకు బస్తాకు ఐదు కిలోల చొప్పున తరుగు తీసినప్పుడు మంత్రిగా పనిచేసిన కొప్పుల ఈశ్వర్ ఏం చేశారని ప్రశ్నించారు. అప్పుడు స్పందించని ఈశ్వర్ ఇప్పుడు రైతుల కోసం దొంగ దీక్షలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాబోయే ఐదేళ్లలో పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయకపోతే ఓట్లు అడగమని, పత్తిపాక రిజర్వాయర్ పూర్తి చేయకపోతే తనతోపాటు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ఓట్లు అడగమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తున్నదన్నారు. 6 గ్యారంటీల్లో భాగంగా ఉచిత బస్సు మహిళల ప్రయాణాన్ని ప్రారంభించి ఇప్పటికే 40 కోట్ల ఫ్రీ టికెట్లు జారీ చేశామన్నారు. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని 10లక్షల రూపాయలకు పెంచామన్నారు. ప్రతి గ్యారెంటీని అమలు చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదే అన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం పూర్తిస్థాయి బడ్జెట్లో హామీలన్నింటికీ నిధులు కేటాయిస్తామన్నారు.

ప్రకృతి వైపరీత్యం వల్ల కరువు ఏర్పడితే ఎంపీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ తెచ్చిన కరువుగా అసత్యపు ఆరోపణలు చేస్తున్నారన్నారు. విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మోడల్ ఎమ్మెల్యే అని, జెన్కో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం గత 100 రోజుల్లో వెయ్యి సార్లు ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రితో పాటు సహచర మంత్రులందరినీ అడిగారన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు ఇప్పుడు చేస్తామని, సింగరేణి నిధులను ఈ ప్రాంత అభివృద్ధి కోసం వెచ్చించేందుకు ప్రయత్నిస్తామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో విసుగు చెందిన తెలంగాణ ప్రజలు మార్పు కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అధికారం కట్టబెట్టారన్నారు. నాలుగు నెలలు గడవకముందే, ఓపికతో వ్యవహరించాల్సిన ప్రతిపక్షం ప్రభుత్వంపై అసత్యపు ఆరోపణలు చేయడం తగదన్నారు.

రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో విద్యావేత్త గడ్డం వంశీకృష్ణను గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ? తన తాత వెంకటస్వామి సింగరేని అభివృద్ధి కోసం ఎంతో చేశారని, గూడు లేని ఎంతోమందికి ఇల్లు కట్టించారన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా గెలిపిస్తే అందుబాటులో ఉండి సేవలు అందించటంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్, గడ్డం వినోద్, గడ్డం వివేక్, ప్రేమ్ సాగర్ రావు విజయ రమణారావు, కాంగ్రెస్ నాయకులు హారకర వేణుగోపాల్, బాబర్ సలీం పాషా, జనప్రసాద్, వెంకట్రావు రాజేష్ లతోపాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓకే రోజు ముగ్గురు రైతుల ఆత్మహత్య

మహబూబాబాద్ / పెద్దపల్లి / సిద్దిపేట ఏప్రిల్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తెలంగాణలో మరో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. దేశానికే అన్నం పెట్టే ముగ్గురు అన్నదాతలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలానికి చెందిన చిక్కుడు శ్రీనివాస్ (48) నాలుగు ఎకరాల పొలంలో వరి పంట వేయగా భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో 7 బోర్లు తవ్వించాడు. రూ. 6 లక్షల వరకు అప్పు కావడంతో పొలం వద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం లోని ఎర్రచక్రు తండాకు చెందిన జాటోత్ శ్రీను (40) మూడున్నర ఎకరాలలో మిరప, రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. మిరప సాగు కోసం రూ. 5 లక్షల వరకు అప్పు చేయగా సాగు నీరు లేక నష్టాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లద్నాపూర్ గ్రామానికి చెందిన ఉడుత సంతోష్ యాదవ్ (34) తనకున్న 8 ఎకరాలలో పత్తి సాగు చేస్తుండగా రూ. 35 లక్షల వరకు అప్పు చేశాడు. నీటి కొరత తెగుళ్లతో ఆశించిన పంట దిగుబడి రాలేదు. దీంతో, మనస్తాపం చెంది గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

# ఎన్నికల వేల సోదాలలో రూ.7.6 కోట్ల నగదు, బంగారు, ఆభరణాలను స్వాధీనం

బెంగళూరు ఏప్రిల్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: పార్లమెంట్ ఎన్నికల సమయంలో కర్నాటక రాష్ట్రంలో భారీగా నగదు, బంగారాన్ని పట్టుకోవడం కలకలం సృష్టించింది. బళ్లారిలోని ఓ వ్యాపారి ఇంట్లో పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సోదాలలో రూ.7.6 కోట్ల నగదు, బంగారు, ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇది లెక్కలోనికి రాని నగదు, ఆభరణాలుగా గుర్తించారు. రూ.5.6 కోట్ల నగదు, 103 కిలోల వెండి ఆభరణాలు, 68 వెండి కడ్డీలు, మూడు కిలోల బంగారు నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హవాలా మార్గంలోనే నగదును తీసుకొచ్చారని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదాయపు పన్ను విభాగానికి తెలియజేస్తామని వ్యాపారి నరేష్ పేర్కొన్నారు. తరువాత ఐటి అధికారులు చర్యలు తీసుకోవచ్చని వివరించారు. కర్నాటకలో మొత్తం 28 లోక్ సభ స్థానాలకు రెండు దశల్లో పోలింగ్ జరుగుతోంది.

## 9 నుంచి బ్యాంకులకు ఐదు రోజుల సెలవులు.. ఇవీ కారణాలు..!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: ఇప్పుడు ప్రభుత్వోద్యోగులు, పెన్షనర్లు, మహిళలు, విద్యార్థులు.. ఇలా ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలు నిర్వహిస్తున్నారు. పెన్షనర్లు, కొందరు వ్యక్తులు ఇప్పటికీ బ్యాంకులను సందర్శించి ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తుంటారు. అటువంటి వారంతా ఏప్రిల్ నెలలో బ్యాంకింగ్ కార్యకలాపాలను పరిశీలిస్తూ, తమ ఆర్థిక లావాదేవీల నిర్వహణకు పూనుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పండుగలు, జాతీయ సెలవు దినాల్లో బ్యాంకులు పని చేయవు. ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి 16 వరకూ ఐదు రోజుల పాటు బ్యాంకులు పని చేయవు.

భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్బీఐ)తోపాటు అన్ని జాతీయ బ్యాంకులకు ఉగాది (తెలుగు సంవత్సరాది) సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో సెలవు. ఏప్రిల్ పది లేదా 11న రంజాన్ పర్వదినం సందర్భంగా బ్యాంకులు పని చేయవు. ఏప్రిల్ 13న రెండో శనివారం, ఏప్రిల్ 14న ఆదివారం జాతీయ సెలవు దినాలు. ఏప్రిల్ 16న శ్రీరామ నవమి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో బ్యాంకులు పని చేయవు.

కనుక వివిధ బ్యాంకుల్లో నేరుగా ఆర్థిక లావాదేవీలు నిర్వహించే ఖాతాదారులు తమ బ్యాంకు శాఖలకు జాతీయ, రాష్ట్రీయ సెలవు దినాలు ఉన్నాయా.. లేదా.. అన్న సంగతి తెలుసుకోవాలని సూచిస్తున్నారు. ఏప్రిల్ నెలలో బ్యాంకులు 12 రోజుల పాటు మూసి ఉంటాయి.

# నేతన్నల జీవితాలతో రాజకీయ క్రీడ ఆడుతున్న బీఆర్ఎస్, బీజేపీలు.. మంత్రి పొన్నం



సిరిసిల్ల, ఏప్రిల్ 8:: నేతన్నల జీవితాలతో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రాజకీయ ఆట ఆడుతున్నాయని, నేతన్నల పేరుతో శవ రాజకీయాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే ఎజెండాగా పెట్టుకున్నాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సిరిసిల్లలో నెలకొన్న వస్త్ర సంక్షోభ పరిస్థితులపై సోమవారం మధ్యాహ్నం సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కేకే మహేందర్ రెడ్డిలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు నేతన్నలపై శవ రాజకీయాలు మెరుపుతున్న సంఘటనలపై ప్రజలకు, నేతన్నలకు వాస్తవాలను తెలియజెప్పడం కోసమే సిరిసిల్లలో మీడియా సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ రెండు పార్టీలు గత పదేళ్లుగా అధికారంలో ఉన్నారని, తాము అధికారంలోకి వచ్చి కేవలం నాలుగు నెలలు మాత్రమే అయ్యిందన్నారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి నేతన్నల ప్రయోజనం కోసం నిర్ణయాలు తీసుకున్నది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు.

బీజేపీ ప్రభుత్వం వస్త్రాలపై 12 శాతం జీఎస్టీని విధించి నేతన్నల నడ్డి విరిచిందని, ఈ రంగాన్ని అనేక విధాలుగా వేధింపులకు గురి చేసిందన్నారు. అనేక జాతీయ పథకాలను రద్దు చేసిందని, బుల్కర్ బీమా, ఐసిఐసిఐ ఆరోగ్య భీమా, హౌస్ కం వర్క్ షెడ్ పథకాలను కేంద్రం రద్దు చేసిందన్నారు. అసమర్థుడైన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఈనెల 10న దీక్ష చేస్తానని అంటున్నాడని, తమిళనాడు, తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చాడో తెలుపాలని పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. టెక్స్టైల్ ఇండస్ట్రీ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే సిరిసిల్ల నంబర్ వన్ గా ఉండేదని, మాజీ ఎంపీ తన ప్రాంతానికి చెందిన వరంగల్ కు మెగా టెక్స్టైల్ క్లస్టర్ ను తీసుకెళ్లాడని, సిరిసిల్లకి ఇవ్వాలని తాము కోరినప్పటికీ ఆనాడు నోరెత్తని ప్రస్తుత ఎంపీ ఏ ముఖం పెట్టుకొని దీక్ష అంటున్నాడని ప్రశ్నించారు. నేత వృత్తి పరమైన అంశం ఆయనకు ఏమీ తెలవదని, కేంద్రం నుండి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని, ఎస్ఐడిపి కింద రూ.350 కోట్లు రావాల్సి ఉండగా 25 శాతం రాష్ట్ర వాటా పోగా ఇందులో 50 శాతం నిధులు కూడా తేలేకపోయాడన్నారు. ఇక మాజీ మంత్రి కేటీఆర్ రూ. 558 కోట్లు అప్పు పెట్టి పోయాడని ఈ పాపం ఎవరిదని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు.

సిరిసిల్లలో నేతన్నలను బెదిరించి ఓట్ల కోసం నిధులను నిలిపివేసి, వారిని పార్టీలో కలుపుకొని రాజకీయాలు చేసింది మీరు కాదా అని కేటీఆర్ ను ప్రశ్నించారు. నేతన్నల సమస్యపై కేటీఆర్ కు తాపత్రయం లేదని, రూ.558 కోట్లు బకాయిలు పెట్టాడని ఇందులో రూ. 352 కోట్లు బతుకమ్మ చీరల అప్పు అని 2016 - 17 నుండి ఈ అప్పులు పెరుగుతూ వస్తున్నా ఎందుకు చెల్లించలేదని, ముఖ్యమంత్రిగా మీ నాయన ఉన్నాడు కదా అని మంత్రి ప్రశ్నించారు. నూతన వధూవరులకు అరుంధతి నక్షత్రం చూపినట్టుగా నేతన్నలను హైదరాబాదుకు పిలిపించుకొని డైనింగ్ టేబుల్ పై కూర్చోబెట్టుకొని భోజనాలు చేయించి భ్రమలు కల్పించారని? కానీ ఒక్కరోజు సంతోషపడిన నేతన్నలు తరువాత కాలమంతా బాధను మింగారన్నారు. నేతన్నలపై తమకు బాధ్యత ఉన్నదని, ఇక్కడ 393 సంఘాలు ఉంటే కేవలం 105 మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. ప్రతి ఎస్ఎస్ఐ యూనిట్, మాక్స్ సొసైటీలు, ప్రతి ఒకరికి పని కల్పించాలని ఆలోచనలోనే ప్రభుత్వం ఉందన్నారు. నేతన్నలకు పని లేదు అనేది లేకుండా పూర్తి స్థాయిలో పని ఇస్తామని, ఇందుకోసం గత నెల మార్చి 11న జీవో నంబర్ ఒకటి ద్వారా రాష్ట్రంలో అన్ని వస్త్రాలను కొనుగోలు చేయాలని నిర్ణయించామన్నారు. తాము నాలుగు నెలల్లోనే రూ. 120 కోట్ల ఆర్డర్లు ఇచ్చామని మంత్రి స్పష్టం చేశారు.

గత ప్రభుత్వం ఆదరించకుండా ఉన్న అద్దకం, సైజింగ్, వార్పిన్ తదితర అన్ని యూనిట్లకు పని కల్పిస్తామన్నారు. మూతపడిన అన్ని యూనిట్లను పునరుద్ధరిస్తామని, వ్యవస్థను బాగు పరుస్తామని, ఇటీవల ఓల్డ్ సిటీలో కూడా పరిశీలన చేశామని, ప్రభుత్వం నేతన్నల పట్ల చాలా సీరియస్ గా ఉన్నదని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో శవాలపై పేలాలు ఏరుకున్నట్టుగానే నేతన్నల శవాలతో రాజకీయాలు చేస్తూ అమరవీరులను రెచ్చగొట్టి, ప్రాణ త్యాగాలకు ప్రేరేపించినట్టుగా నేతన్నల పట్ల వ్యవహరిస్తున్నారని, ఉద్యమంలో సామాన్యులే చనిపోతున్నారని ఆరోపించారు. నేతన్నలకు ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తామని, నేతన్నల సంక్షేమం కోసం ఎవరికి కష్టం రాకుండా చూసే బాధ్యత మాదేనన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ల కంటే ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఒక రూపాయి ఎక్కువగానే ఇస్తామని, బకాయలు అన్ని తీరుస్తామని, నేతన్నలు నిరాశ పడవద్దన్నారు. 7 లక్షల కోట్ల బాకీలు భరిస్తున్న తమ ప్రభుత్వం నేతన్నల బకాయిలు కూడా చెల్లిస్తామని, మొదటి దశ కింద కొంత బకాయలు, రెండవ దశలో మిగిలిన బకాయలు చెల్లిస్తామని, ఇది కాంగ్రెస్ ఇస్తున్న మాట తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న మాట అని అన్నారు. ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సిరిసిల్లపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు సవాలు విసురుతూ మీరు బకాయిలు పెడితేనే ఈ పరిస్థితి సిరిసిల్లలో నెలకొన్నదన్నారు.

నేతన్నల కోసం ప్రణాళిక చేస్తున్నామని గాబరా పడవద్దని, తాము అధికారంలో ఉన్నామని, నష్టం తెస్తే తమను అడగవచ్చన్నారు. బండి సంజయ్ దీక్ష చేసే ముందు జీఎస్టీ ఎందుకు విధిస్తున్నారు, ఖాదీ బోర్డును, టెక్స్టైల్ బోర్డును ఎందుకు రద్దు చేశారు జవాబు చెప్పాలని పొన్నం డిమాండ్ చేశారు. ఇంతకాలం ఎవరు వినతి పత్రాలు ఇస్తామన్నా అవకాశం ఇవ్వలేదని, అప్రకటిత కల్లోలిత ప్రాంతంగా ఉంచారని, తాము అందరి విన్నపాలు వింటున్నా మన్నారు. మారుతున్న కాలానుగుణంగా నేతన్నలకు శిక్షణ ఇస్తూ వారి జీవితాల్లో మార్పు తెస్తామని, ఒక గీతన్నగా మాట ఇస్తున్నట్టు తెలిపారు. సిరిసిల్లలో 12 ఏఏవై కార్డులు ఉంటే వాటిని రద్దు చేసింది కేటీఆర్ కాదా అని ప్రశ్నిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు వారికి లేదని, ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. వస్త్ర ప్రపంచంలో ఆదర్శంగా, మోడల్ గా సాంకేతికపరంగా అభివృద్ధి చేయడానికి సహకరిస్తామన్నారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలలో ఇప్పటికే రూ. 80కోట్లు విడుదల చేశామని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

## ప్రజల జీవితాల్లో ఈ ఉగాది వసంతం నింపాలి : కేసీఆర్

హైదరాబాద్ : రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో వసంతాన్ని నింపి, క్రోధి నామ సంవత్సరంలో ప్రజలు ప్రశాంతంగా జీవించేలా దీవించాలని ప్రకృతిమాతను కేసీఆర్ ప్రార్థించారు. ఉగాది నుంచి కాలచక్రం తిరిగి మొదలవుతుంది. చెట్లు చిగురిస్తూ ప్రకృతిలో నూతనోత్తేజం నెలకొంటుంది. వ్యవసాయ పనులను రైతన్నలు ఉగాది నుంచే ప్రారంభిస్తారు. అందుకే ఉగాదిని వ్యవసాయ నామ సంవత్సరంగా పిలుచుకుంటాం అని కేసీఆర్ పేర్కొన్నారు.

## మహిళలపై అణచివేతను అనుమతించబోం : రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: ఏ మతమైనా మహిళలపై అణచివేతను అనుమతించబోమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. తమిళనాడులో జరిగిన ఓ కార్యక్రమంలో ట్రిపుల్ తలాక్ చట్టంపై ఆయన స్పందించారు. సీఏఏ చట్టంతో ఎవరూ తమ పౌరసత్వాన్ని కోల్పోరని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. డీఎంకే, కాంగ్రెస్‌లను లక్ష్యంగా చేసుకుని రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. రెండు తమ కుటుంబాల కోసం పనిచేస్తున్నాయని, ప్రధాని మోదీ దేశం కోసం పనిచేస్తున్నారన్నారు. కిరిబులో ఆయన రోడ్‌లో నిర్వహించారు. నామక్కల్ అభ్యర్థి కేపీ రామలింగం తరఫున ప్రచారం నిర్వహించారు. అలాగే తిరువూరు అభ్యర్థి ఎస్‌జీఎం రమేశ్ తరఫున ఆయన ప్రచారం చేయనున్నారు. సాయంత్రం రాజ్‌నాథ్ సింగ్ తెన్‌కాశీలో బీజేపీ అభ్యర్థి బీ జాన్ పాండియన్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహించ నున్నారు. రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు కేంద్ర మంత్రులు అనురాగ్ ఠాకూర్, పురుషోత్తం రూపాల సైతం తమిళనాడులో పార్టీ తరఫున ప్రచారం చేయనున్నారు.

# మేడిగడ్డ బ్యారేజ్‌కి తాత్కాలిక మరమ్మత్తులు చేసి రైతులకు నీరు అందించాలి: సిపిఎం



జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ లక్ష్మి బ్యారేజ్ ని సోమవారం సిపిఎం రాష్ట్ర నాయకులు సందర్శించారు. మేడిగడ్డ బ్యారేజ్ కి ఉదయం 11 గంటలకు ప్రాంతానికి చేరుకొని బ్యారేజ్ లోనీ కుంగిన పిల్లర్లను పరిశీలించారు. అనంతరం సిపిఎం నాయకులు మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజ్ ని తాత్కాలిక మరమ్మత్తులు చేసి రైతులకు నీరు అందించాలని అన్నారు. సాగు నీటి ప్రాజెక్ట్ లో నే అత్యధిక ఖర్చు చేసిన ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టు అని, పేర్కొన్నారు. అలాంటి ప్రాజెక్టు భాగమైన మేడిగడ్డ కుంగిపోవడం దారుణమని మండిపడ్డారు. మేడిగడ్డ కుంగిపోవడం పై న్యాయ విచారణ చేసి బాధితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కరువు ఏర్పడుతుందని ప్రస్తుతానికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి తక్షణమే రైతులకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కొనసాగించాలా లేదా తర్వాత ఆలోచించండి కానీ ప్రస్తుతం రైతులకు నీరు అందించాలని ప్రభుత్వాన్ని సిపిఎం నాయకులు కోరారు.

## ఉగాది మహోత్సవాల్లో తొక్కిసలాట జరుగొద్దు.. భద్రతపై అప్రమత్తంగా ఉండాలని ఈఓ ఆదేశం..!



శ్రీశైలం, ఏప్రిల్ 8: శ్రీశైల మహాక్షేత్రంలో జరుగుతున్న ఉగాది మహోత్సవాల ఏర్పాట్లను దేవస్థానం ఈఓ డీ పెద్దిరాజు, పోలీసు, దేవస్థానం, రెవెన్యూ అధికారులు సోమవారం పర్యవేక్షించారు. క్షేత్ర పరిధిలోని పలు ప్రదేశాలను సందర్శించి, అక్కడ ఏర్పాట్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు జారీ చేశారు. సాయంకాలం ప్రభోత్సవం జరిగే ఆలయ వీధి, క్యూలైన్లలో పరిస్థితులను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీసీటీవీ కెమెరాల ద్వారా పార్కింగ్ ప్రదేశాలు, ఇతర రద్దీ ప్రదేశాలు, పాతాళగంగ, కాలిబాట మార్గం, క్షేత్ర పరిధిలోని పలు ప్రదేశాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఈఓ డీ పెద్దిరాజు తదితర అధికారులు మాట్లాడుతూ కంట్రోల్ రూమ్ లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని చెప్పారు. కంట్రోల్ రూమ్‌లోని స్క్రీన్ల ద్వారా ఎప్పటికప్పుడు క్షేత్ర పరిధిలోని అన్ని ప్రదేశాలు, క్యూలైన్లను క్షుణ్ణంగా పరిశీలిస్తుండాలని ఆదేశించారు. నిరంతరం అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు.

సోమవారం సాయంకాలం జరిగే ప్రభోత్సవం, రాత్రి జరిగే వీరాచార విన్యాసాలు .. అగ్ని గుండ ప్రవేశ కార్యక్రమం ఏర్పాట్లన్నీ ఎటువంటి లోపం తలెత్తకుండా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభోత్సవం, వీరాచార విన్యాసాలు.. అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాల్లో తొక్కిసలాటలు జరుగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని దేవస్థానం భద్రతా విభాగం అధికారిని ఆదేశించారు. భద్రతా చర్యలపై పోలీస్ శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని కూడా సూచించారు.

## సీఎం రేవంత్ రెడ్డికి తృటిలో తప్పిన పెను ప్రమాదం..

హైదరాబాద్, ఏప్రిల్ 8:తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి తృటిలో పెను ప్రమాదం తప్పింది. రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో పర్యటించబోతున్నారు. హైదరాబాద్ నుంచి కొడంగల్ వెళ్తుండగా మార్గమధ్యలో సీఎం కాన్వాయ్‌లోని ఓ కారు టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ అప్రమత్తతతో పెనుప్రమాదం తప్పినట్లయ్యింది. మరోవైపు.. సీఎం భద్రతా సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. వెంటనే ఆ టైరును రిపేరు చేయడానికి స్థానికంగా ఉన్న మెకానిక్‌ను సిబ్బంది పిలిపించారు. ఈ ఘటన జరిగాక ఈ ఒక్క కారు తప్ప మిగిలిన వాహనాలతో రేవంత్ కొడంగల్‌కు చేరుకున్నారు. కొద్దిసేపటి క్రితమే కొడంగల్ పట్టణంలోని తన నివాసానికి ముఖ్యమంత్రి చేరుకున్నారు. స్థానిక నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి రేవంత్‌కు ఘన స్వాగతం పలికారు.

**నేటి కందం- నేటికి అందం**

క్రోధాదుల తొలగించెడి
సాధన నందించి భువికి శాంతిని గూర్పన్
బోధాసుధలను దెచ్చెడి
"క్రోధి"ని బూజింతు దివ్య గుణ వారాశిన్
(9-4-24 క్రోధి నామ సంవత్సర ఉగాది )



-రాధశ్రీ
సెల్:9494481210

# క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన సంబరాలు

'యుగం(వయస్సు లేదా కాలం)' మరియు 'ఆది(ప్రారంభం)' అనే పదాల కలయికతో ఉగాది లేదా యుగాది (నవ యుగానికి నాంది) పండుగ ఉద్భవించింది. విశ్వ సృష్టి తొలి రోజుగా ఉగాదిని నమ్ముతారు. ఉగాది అంటే గతాన్ని విడిచి పెట్టి, సానుకూల మనస్సుతో జీవితంలో నూతన దశకు నాంది పలకడం. చాంద్రమాన క్యాలెండర్ లేదా పంచాంగం ప్రకారం నూతన సంవత్సర మొదటి రోజును ఉగాది పర్వదినంగా ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, గోవా రాష్ట్రాల ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. హిందూ క్యాలెండర్ ప్రకారం చైత్ర మాస తొలి రోజును ఉగాదిగా ఈ ఏడాది గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం 09 ఏప్రిల్ 2024 రోజున నిర్వహించుకుంటారు. ఇదే రోజున మహారాష్ట్ర, ఎంపీ, దాద్రా నగర్ హవేలి, డమన్ – దయ్యూలలోని హిందువులు 'గుడి పడ్వా' అనే పేరుతో పండుగ జరుపుకుంటారు.

## ఉగాది షడ్రుచుల పచ్చడి:

ఉగాది పండుగ రోజున సూర్యోదయానికి పూర్వమే తైల స్నానాలు చేయడం, కొత్త వ్యాపారాలు ప్రారంభించడం, మామిడి ఆకులతో తోరణాలు కట్టడం, సంస్కృతి ఉట్టిపడే నూతన వస్త్రాలు ధరించడం, రుచికరమైన సాంప్రదాయ వంటకాలు ఆరగించడం, ఇండ్లను పరిశుభ్రంగా రంగులతో అలంకరించడం, ఆలయాల్లో ప్రార్థనలు చేయడం, తీపి చేదు షడ్రుచుల (వేప పువ్వు, కారం, చింతపండు, బెల్లం, ఉప్పు, మామిడి కాయ ముక్కలు) ఉగాది పచ్చడిని సేవించడం లాంటి ఆర్భాటాలు చేయడం పరిపాటి. రాబోయే వసంత రుతువును కూడా సాగుబడి కాలానికి రైతులు స్వాగతం పలుకుతారు. ఉగాది పర్వదిన శుభవేళ బ్రహ్మ, గణేశుడు, లక్ష్మి దేవి, మాతాపార్వతి, విష్ణువు, రాముడు లాంటి దేవతలను ఉగాది రోజున పూజిస్తారు.

## క్రోధి నామ సంవత్సరం:

ఉగాది పండుగ రోజున పంచాంగ శ్రవణాలు, జాతక విశేషాలు తెలుసుకోవడం ఆచారంగా వస్తున్నది. 60 సంవత్సరాల చక్రంలో "ప్రభవ" నుంచి "అక్షయ" సంవత్సరాల జాబితాలో 38వ "క్రోధి" నామ సంవత్సర ఆరంభం 09 ఏప్రిల్ 2024న ఉగాది పండుగను జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాం. క్రోధి నామ సంవత్సరంలో సూర్యుడు ధాన్యాధిపతిగా పంటల ధరలు పెరుగుతాయని, చమురు బావుల్లో ప్రమాదాలు పెరుగవచ్చని, నీట మునిగిన పురావస్తు కోటలు బయట పడతాయని, అధిక వర్షపాతంతో పంటలు బాగా పండుతాయనే పలు పంచాంగ శ్రవణ సూచనలు చేయడం జరుగుతోంది.

"శోభకృత"కు సాదర వీడ్కోలు పలుకుతూ, "క్రోధి" నామ సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ, వచ్చే ఏడాది "విశ్వావసు" ఉగాదికి ఆశావహ దృక్పథంతో ఎదురుచూస్తూ, రాబోయే సాధారణ ఎన్నికల్లో అర్హులైన నిస్వార్థ సేవకులను ఎన్నుకొని శాంతి సౌభాగ్యాలతో భారతీయ జనులు జీవనయానం చేద్దాం, క్రోధి లేదా కోపాన్ని జయించి సుఖ జీవనం గడుపుదాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# నేతన్నలపై ప్రభుత్వం కక్ష కట్టొద్దు.. ఆర్డర్లు ఇచ్చి ఆదుకోవాలి



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 8:(నేటినిజం ప్రతినిధి): సిరిసిల్లలోని నేతకార్మికులపై ప్రభుత్వం కక్ష కట్ట వద్దని, వెంటనే బకాయిలు చెల్లించి ఆదుకోవాలని, పరిశ్రమకు ఆర్డర్లు ఇవ్వాలని కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి బీ వినోద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌లో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నేతకార్మికుడు సిరిపురం లక్ష్మీనారాయణ కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. లక్ష్మీనారాయణ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. రూ.50వేల ఆర్థిక సాయం అందించి భరోసానిచ్చారు.

అనంతరం ఆయన మాట్లాడారు. సిరిసిల్లలోని నేత కార్మికులు మూడు నెలలుగా పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కుటుంబాలను పోషించుకోలేక సతమతమవుతున్నారని వివరించారు. ఈ క్రమంలోనే ఉపాధి కరువై నేత కార్మికుడు లక్ష్మీనారాయణ ఆత్మహత్య చేసుకోవడం కలిచి వేసిందన్నారు. 20 ఏళ్ల కిందట ఇక్కడ నేతకార్మికులు వరుసగా ఆత్మహత్యలు చేసుకుంటే, ఉద్యమసమయంలో కేసీఆర్ రూ.50లక్షలు అందించి ఆదుకున్నారని గుర్తు చేశారు.

తెలంగాణ రాగానే నేతకార్మికులకు బతుకమ్మ చీరలు, క్రిస్మస్, రంజాన్ సందర్భంగా అందజేసేందుకు వస్త్ర కానుకలు, పిల్లల యూనిఫాం బట్ట తయారీ ఆర్డర్లు అందించి అండగా నిలిచారన్నారు. నేత కార్మికులపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష కట్టవద్దని, వీరికి చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని కోరారు. నేతకార్మికులు మనోధైర్యం కోల్పోవద్దని, త్వరలోనే మంచి రోజులు వస్తాయని చెప్పారు.

# రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. సమ్మర్ నేపథ్యంలో 48 ప్రత్యేక రైళ్లను ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్ చెప్పింది. తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంత్రాలకు 48 ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు ప్రకటించింది. వేసవికాలం రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొంది. సికింద్రాబాద్–నాగర్‌సోల్, నాగర్‌సోల్–సికింద్రాబాద్, తిరుపతి– మచిలీపట్నం, మచిలీపట్నం–తిరుపతి, సీఎస్‌టీ ముంబయి – కరీంనగర్, కరీంనగర్–ముంబయితో పాటు యశ్వంత్‌పూర్–కాలాబుర్గి మధ్య ప్రత్యేక రైళు నడుస్తాయని తెలిపింది. సికింద్రాబాద్–నాగర్‌సోల్ (07517) ప్రత్యేక రైలు ఏప్రిల్ 17 నుంచి మే 29 వరకు ప్రతి బుధవారం అందుబాటులో ఉంటుందని పేర్కొంది.

నాగర్‌సోల్ – సికింద్రాబాద్ (07518) రైలు ఏప్రిల్ 18 నుంచి మే 30 వరకు ప్రతి గురువారం నడుస్తుందని చెప్పింది.

తిరుపతి– మచిలీపట్నం (07121) రైలు ఈ నెల 14 నుంచి మే 26 వరకు ప్రతి ఆదివారం పరుగులు తీయనున్నది. మచిలీపట్నం–తిరుపతి (07122) రైలు ప్రతి సోమవారం ఈ నెల 15 నుంచి మే 27 మే వరకు నడుస్తుందని పేర్కొంది.

సీఎస్‌టీ ముంబయి – కరీంనగర్ (01067) రైలు ఈ నెల 9 నుంచి మే 28 వరకు ప్రతి మంగళవారం ప్రత్యేక రైలు అందుబాటులో ఉందని చెప్పింది. కరీంనగర్–సీఎస్‌టీ ముంబయి (01068) రైలు ఈ నెల 10 నుంచి మే 29 వరకు పరుగులు తీయనున్నది. యశ్వంత్‌పూర్–కాలాబుర్గి (06505) రైలు ఈ నెల 8న, కాలాబుర్గి–యశ్వంత్‌పూర్ (06506) రైలు ఈ నెల 9న నడువనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వివరించింది.

# నా బలం.. బలగం యువతే.. వారు తలచుకుంటే సాధ్యం కానిదేమీ ఉండదు : హరీశ్‌రావు




సిద్దిపేట, ఏప్రిల్ 8: నా బలం.. బలగం యువతే.. వారు తలచుకుంటే సాధ్యం కానిదేమీ ఉండదని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఢిల్లీలో తెలంగాణ గొంతు వినిపించడానికి మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. సిద్దిపేట కొండమల్లయ్య గార్డెన్స్‌లో యువతతో ఏర్పాటు చేసిన సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు.

కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి.. 100 రోజులు గడిచినా హామీలు నెరవేరలేదు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి. తెలంగాణ వద్దు అంటూ తుపాకీ ఎక్కుపెట్టిన రేవంత్ ఈ రోజు సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్నాడు.

రేవంత్ రెడ్డి జై తెలంగాణ అని ఏనాడైనా అన్నారా.. బీఆర్ఎస్ ఉద్యోగాలు ఇస్తే.. కాంగ్రెస్ ఇచ్చినట్లు చెబుతున్నారు. దుబ్బాకలో చెల్లని రూపాయి.. మెదక్‌లో చెల్లుతుందా.. సిద్దిపేట అభివృద్ధి అడ్డుకున్న కాంగ్రెస్, బీజేపీకి బుద్ధి చెప్పాలి అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

యువత ఆలోచించి ఓటు వేయాలి. ప్రజల సంక్షేమం కోసం కష్టపడుతున్న వెంకట్రామిరెడ్డిని గెలిపించి పార్లమెంటుకు పంపాలి. ఎన్నికల హామీల అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్‌కు, ధరలతోపాటు నిరుద్యోగాన్ని పేదరికాన్ని పెంచిన బీజేపీకి గుణపాఠం నేర్పాలి. తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం. యువత తలచుకుంటే సాధ్యం కానిదేమీ ఉండదు అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# వినోద్ కుమార్‌కు, గుట్కా పాకెట్లకు మధ్య జరుగుతున్న యుద్ధం ఇది : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



కరీంనగర్, ఏప్రిల్ 8: తెలంగాణ ప్రజలకు, తెలంగాణ ద్రోహులకు మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవి అని బీఆర్ఎస్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కావాలి.. ప్రపంచ పటంలో కనిపించాలని గుండెల నిండా ప్రేమ ఉన్న వినోద్ కుమార్‌కు, గుట్కా పాకెట్లకు మధ్య జరుగుతున్న యుద్ధం ఇది అని ఆయన తేల్చిచెప్పారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నిర్వహించిన కరీంనగర్ యుద్ధభేరీ సభలో ఆర్ఎస్పీ పాల్గొని ప్రసంగించారు.

రేవంత్ ఆదేశాల మేరకు ప్రతిపక్ష నేతలపై పోలీసులు కేసులు పెడుతున్నారు. కేసులకు భయపడకుండా.. పోరాటం చేయాలి. వినోద్‌కుమార్‌ను పార్లమెంట్‌కు పంపించేంత వరకు నిద్ర పోవద్దు. మనం ఇవాళ ఆత్మగౌరవంతో ఉన్నామంటే ఎంతో మంది మహనీయుల త్యాగం ఉంది అని ఆర్ఎస్పీ తెలిపారు.

తెలంగాణ వ్యాప్తంగా యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి..

ఇది వినోద్ కుమార్, బండి సంజయ్ మధ్య పోరాటం కాదు.. ఇది కేసీఆర్, రేవంత్ రెడ్డి మధ్య పోరాటం కాదు.. తెలంగాణ ప్రజలకు, తెలంగాణ ద్రోహులకు మధ్య జరుగుతున్న యుద్ధం ఇది. ఇవాళ తెలంగాణలో యుద్ధం జరుగుతున్నది. తెలంగాణ వ్యాప్తంగా యుద్ధ మేఘాలు కమ్ముకుని ఉన్నాయి.

పదేండ్ల నిజమైన పాలనకు, 100 రోజుల అబద్దానికి మధ్య యుద్ధం జరుగుతున్నది. రైతుల కష్టాలు తెలుసుకునేందుకు మండుటెండల్లో కేసీఆర్ తిరుగుతుంటే.. ఎవరన్న ఎక్కడన్న చావనని చెప్పి? ఉప్పల్ స్టేడియంలో కూర్చొని మ్యాచ్ చూస్తున్న రేవంత్ రెడ్డి మధ్య జరుగుతున్న యుద్ధం ఇది అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు.

## ఆశయానికి, అహంకారానికి మధ్య జరుగుతున్న యుద్ధం ఇది..


తెలంగాణ ప్రజల ఆశయానికి, కాంగ్రెస్ నాయకుల అహంకారానికి మధ్య జరుగుతున్న యుద్ధం ఇది. 200 మంది రైతులు చనిపోయారని చెప్పినప్పుడు.. తెలివైన సీఎం అయితే వివరాలు సేకరించి, వారి దగ్గరకు వెళ్తారు. రైతులను కాపాడుకుంటామని హామీ కూడా ఇస్తారు. కానీ అహంకారం ఏంటంటే.. మీ దగ్గర లిస్ట్ ఉంటే ఇవ్వండి. వెరిఫై చేస్తాం అని అహంకారంతో అంటున్నారు. కాబట్టి అహంకారానికి కాకుండా ఆశయానికి ఓటు వేయాలని ఆర్ఎస్పీ పిలుపునిచ్చారు.

## రాజ్యాంగాన్ని రక్షించుకునే పోరాటం ఇది..

దయచేసి గులాబీ శ్రేణులంతా సైనికులుగా మారి ఊరూరా పోవాలి.. ఇది మన భవిష్యత్ బతుకు పోరాటం. ఇది మన పిల్లల భవిష్యత్, రైతుల కన్నీళ్లు తుడిచే పోరాటం.. ఇది మన రాజ్యాంగాన్ని రక్షించుకునే పోరాటం. బండి సంజయ్ గెలిస్తే.. బీజేపీకి మెజార్టీ వస్తే.. మోదీ, అమిత్ షా మనుస్మృతి ఆధారంగా తయారు చేసుకున్న రాజ్యాంగాన్ని పార్లమెంట్‌లో ఆమోదిస్తారు.. కాబట్టి జాగ్రత్తగా ఓటు వేసి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని ఆర్ఎస్పీ సూచించారు.

# పొగాకు ఉత్పత్తులు, ప్రకటనల నియంత్రణ చట్టం, 2003 ను అమలు చేయండి

## - గవర్నర్ రాధాకృష్ణన్ ను కోరిన కౌన్సిల్ ఫర్ పబ్లిక్ హెల్త్ సంస్థ




తెలంగాణ, ఆగస్టు 8 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);, – తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌తో కౌన్సిల్ ఫర్ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ కుమార్ చెరాకుల సమావేశమైనారు. కౌన్సిల్ ఫర్ పబ్లిక్ హెల్త్ సంస్థ యొక్క లక్ష్యాలను వివరించారు. పొగాకు రహిత విద్యా సంస్థల (ఏటీఈఐ) మార్గదర్శకాలను అత్యవసరంగా అమలు చేయడం మరియు పొగాకు ఉత్పత్తులు మరియు ప్రకటనల నియంత్రణ (అూఖం చట్టం, 2003) అమలు కోసం ఆయన గవర్నర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా గవర్నర్ రాధాకృష్ణన్, ప్రజారోగ్యం కోసం తన అచంచలమైన అంకితభావంతో, పని చేస్తున్న సంస్థకు ప్రశంసలను అందజేయడమే కాకుండా తన హృదయపూర్వక మద్దతును ప్రకటించారు. విద్యా అమరికలలో శ్రేయస్సు మరియు చైతన్యానికి ప్రాధాన్యతనిచ్చే సంస్కృతిని పెంపొందించడం యొక్క ప్రాముఖ్యతను గూర్చి గవర్నర్ నొక్కి చెప్పారు. డాక్టర్ సర్వప్రియ పాండే మరియు డాక్టర్ దుర్గా ప్రసాద్ ముద్రకోల యువత తమ ఆరోగ్యానికి సంబంధించి అవగాహనతో కూడిన నిర్ణయాలు తీసుకునేలా నిర్ణయాత్మక చర్య తీసుకోవాలని కోరారు. ఈ కీలక సమావేశం ప్రజారోగ్యం మరియు మన యువత శ్రేయస్సు పట్ల సమిష్టి నిబద్ధతను స్పష్టం చేసింది.

# నాసా'ప్రోగ్రాంకు ఎంపికైన శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థిని



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 8:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్ లో 8వ తరగతి చదువుతున్న వేముల వెన్నెల 'నాసా' ప్రోగ్రాంకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులచే పాఠశాల నుండి చెక్కపెల్లి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి, టపాకాయలు పేల్చి, సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య విద్యాసంస్థల ఏజీఎం ముద్ర కొల రాజు మాట్లాడుతూ పదకొండు సంవత్సరాల నుండి శ్రీచైతన్య విద్యార్థులు ఎంపకవడం జరుగుతుందని, వేములవాడ బ్రాంచ్ నుండి వేముల వెన్నెల ఎన్నిక కావడం చాలా సంతోషంగా ఉందని కొనియాడారు. విద్యార్థిని ఆదర్శంగా తీసుకుని, ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని సూచించారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ముద్రకోలా రాజు, ప్రిన్సిపల్ సతీష్ కుమారి క, అకాడమిక్ డీన్ పి శేఖర్, నాసా ఇంచార్జ్ నాగరాజు, కోఆర్డినేటర్ పార్లపల్లి ప్రవీణ,ప్రైమరీ ఇంచార్జి రజిత,పీ టీ ఇంచార్జి యం. మమత, ఏ ఓ ఆకునూరి సుధీర్, పి.ఇ. టి సుధాకర్, మారుతి పాల్గొన్నారు.




# కేసీఆర్‌ను తిట్టేందుకు కాంగ్రెస్ పార్టీ రూ. 100 కోట్ల ఖర్చు : మన్నె క్రిశాంక్

హైదరాబాద్, ఏప్రిల్ 8: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను తిట్టేందుకు కాంగ్రెస్ పార్టీ రూ. 100 కోట్లు ఖర్చు పెట్టిందని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మన్నె క్రిశాంక్ మీడియాతో మాట్లాడారు.

రూ. 100 కోట్లతో తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ సభ అజెండా ఏందంటే.. కేవలం కేసీఆర్‌ను తిట్టడమే. రాహుల్, రేవంత్ రెడ్డి కలిసి కేసీఆర్‌ను తిట్టారు. కేసీఆర్ అంటేనే రాహుల్, రేవంత్ భయపడుతున్నారు. ఇక రాహుల్ గాంధీ మళ్లీ రాసిచ్చిన స్క్రిప్టునే చదివారు.

వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన రూ. 500 బోనస్, రైతుకు రూ. 15 వేల ఆర్థికసాయం వంటి హామీలను అమలు చేయలేదు. ఇప్పుడేమో తుక్కుగూడ వచ్చి కేసీఆర్ ఫోన్ ట్యాపిగ్ ఆరోపణ చేశారు రాహుల్. రైతు ఆత్మహత్యలు, ఎండిన పంటల అంశాన్ని, రైతుల డిమాండ్లను పక్కదారి పట్టించేందుకు ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తీసుకొచ్చారని మన్నె క్రిశాంక్ పేర్కొన్నారు.

## ఓట్ల కోసం వెబ్‌సిరీస్‌గా ఫోన్ ట్యాపింగ్

ఓట్ల కోసం ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌ను వెబ్‌సిరీస్‌గా నడిపిస్తోంది. మోదీనేమో ఈడీ పేరుతో హింసిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమో ప్రతిపక్షాలపై బురదజల్లి ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. 10 లక్షల కన్వర్జేషన్స్ ట్యాపింగ్ చేశారని, దీని కోసం వార్ రూమ్స్ ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మరి వాటిపై నిస్పక్షపాతంగా విచారణ చేయాలని క్రిశాంక్ డిమాండ్ చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ అవసరమని మన్మోహనే చెప్పారు

సోనియా యూపీఏ చైర్‌పర్సన్‌గా, రాహుల్ ఎంపీగా ఉన్నప్పుడు, నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఫోన్ ట్యాపింగ్‌పై ఒక స్టేట్‌మెంట్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ అవసరమని మన్మోహనే చెప్పారు.

మరి మన్మోహన్‌ను బద్నాం చేశారా.. మరి మేం మాట్లాడితే రేవంత్ రెడ్డి తమపై కేసులు పెట్టిస్తున్నారు. మరి రాహుల్ గాంధీకి అప్పుడు సోయి లేదా.. అప్పుడు ఎంపీగా ఉన్నారు కదా.. మరి ఇవాళ మన్మోహన్ మీద ఎందుకు విచారణ చేయలేదు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా వారు ఫోన్ ట్యాపింగ్ విషయాలను బయటపెట్టలేమని ఢిల్లీ హైకోర్టుకు తెలిపారు.

ఫోన్లు ట్యాపింగ్ జరిగాయా.. లేదా.. అన్నది ట్రాయ్‌ని అడగండి. మరి ఈ కేసులో ట్రాయ్, టెలికాం ప్రొవైడర్లను ఎందుకు పెట్టలేదు. ఎందుకంటే కొందర్నీ కాపాడే ప్రయత్నం చేస్తున్నట్లు అనుమానం వస్తుంది. ఏది నిజమో తెలియడం లేదని మన్నె క్రిశాంక్ పేర్కొన్నారు.




# శ్రీ క్రోధినామం - నీ రాక ఈశ్వరానుగ్రహం

## ఉగాది పండుగ ప్రస్తావన :

భారతదేశంలోని, హిందువులందరికీ, ఉగాది పండుగ ముఖ్యమైన చారిత్రాత్మక పండుగ. ఈ ఉగాది పండుగను ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో ఉన్న తెలుగు వారికి మాత్రమే కాకుండా, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లోనూ, ఆనవాయితీగా వస్తున్న వారి ఆచార సంప్రదాయాలను బట్టి జరుపుకోవడం జరుగుతుంది. తెలుగుసంస్కృతితో అలరారే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాష్ట్రాలలో ఉగాది తెలుగు సంవత్సరాదిగా బహు విశిష్టతను సంతరించుకుంది. పంచాంగ శ్రవణం జరుపుట ఆనవాయితీగా వస్తోంది. ఆ ఏడాదికి కలిసి వచ్చే శుభాలను పరిగణలోకి తీసుకునే ఆచారం కొనసాగుతోంది. ఈ విధంగా ఆ రంగాలకు కలిసి వచ్చే శుభాలను స్వీకరిస్తూ, జ్యోతిష్యపండితుని తమ శక్త్యానుసారం, సత్కరించుకుని పంచాంగ శ్రవణం వింటూ ఉండటం చూస్తుంటాము. అలాగే అనేకానేక సంస్కృతిక సంస్థలు సభలలో కవి, సమ్మేళనాలు జరుపుతూ, సందడి చేస్తూన్న "కవులకు" కోయిల కూత, వేప పూత వంటి కైతలు అందించిన కవిమిత్రులు, సుకవులు, రసజ్ఞులకు వసంత సంతస కుసుమార్చనలు అందించే శుభదినముగా కూడా చెప్పుకోవచ్చు." ఇక ఇంటింటా ఆ సంవత్సరము లోని మంచి చెడులను, ఆదాయ ఫలములను, స్థూలంగా తమ, తమ జన్మ నక్షత్రం ఆధారంగా, ఈ ఏడాది భవిష్యత్ క్రమము తెలుసుకొని దాని కనుగుణమైన నిర్ణయాలు తీసుకోవటానికి దాదాపు ప్రతి ఒక్కరుకూడా శ్రద్ధ చూపడం పరిపాటి. ఉగాది పండుగ వచ్చే నాటికి, శిశిర ఋతువు ఆకురాలు కాలం. తరువాత వసంతం ఋతువు వస్తుంది. చెట్లు చిగుర్చి ప్రకృతి శోభాయమానంగా వుంటుంది. ఉగాది రోజు నుండే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగ. ఉగాది రోజున కొత్తగా పనులు ప్రారంభించుట పరిపాటి. ఆ రోజున ప్రాతః కాలమున లేచి ఇళ్లు, వాకిళ్లు, శుభ్ర పరచుకుంటారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి అలంకరిస్తారు. తలంటి స్నానం చేసి, కొత్తబట్టలు ధరించి, ఉగాది పచ్చడితో దినచర్య ప్రారంభిస్తారు. ఉగాది సంప్రదాయాను సారంగా, రైతులను గౌరవించే వేడుకగా, ఇంకా తెలుగు రాష్ట్రాలలో ప్రతిఒక్కరు కూడా తమదిగా భావించే పండుగ ఉగాది.

## ఉగాది పుట్టుపూర్వోత్తరాలు:

ఉగస్యఆది అనేదే ఉగాది. "ఉగాది", మరియు "యుగాది" అనే రెండు పదాలు వాడుకలో ఉన్నాయి. "ఉగ" అనగా నక్షత్ర గమనం. నక్షత్రగమనానికి 'ఆది' 'ఉగాది'. అంటే సృష్టి ఆరంభమైనదినమే "ఉగాది". 'యుగము' అనగా ద్వయము లేక జంట అని కూడా అర్థము. ఉత్తరాయణ, దక్షిణాయన ములనబడే ఆయన ద్వయ సంయుతం 'యుగం' 'ఆది' అనగా మొదలు 'ఉగాది'. అనగా ప్రపం చము యొక్క జన్మ ఆయుష్షులకు మొదటిరోజు కనుక ఉగాది అయినది. సూర్యునికి సకల ఋతువులకు ప్రాతః సాయంకాలాది త్రికాల ములకు ఉషాదేవతయే మాతృస్వరూపము. భారతీయ సంప్రదాయం ప్రకారం చైత్రశుక్లపాడ్యమి నాడే, అనగా "ఉగాది" రోజున బ్రహ్మ సృష్టిని నిర్మించడం ప్రారంభించారని నమ్ముతారు. మత్స్యావతారము ధరించిన విష్ణువు సోమకుని సంహరించి వేదాలను బ్రహ్మకప్పగించిన సందర్భంగా 'ఉగాది' ఆచరణలోకి వచ్చెనని పురాణైతిహాసంగా చెప్పబడుతున్నది. అంటే కాలగణాన్ని గ్రహ, నక్షత్ర, రుతు, మాస, వర్షాధికులను సృష్టి ఆరంభించిన సంకేతంగా ఉగాది జరుపబడుచున్నట్లుగాను, వసంతఋతువు కూడా అప్పుడే మొదలవుతుంది కనుక కొత్త జీవితానికి నాంది, ఆది వేది పునాదిగా ఉగాది పండుగను జరుపుకుంటారు. శాలివాహన, తన శౌర్యపరాక్రమాలతో యుగకర్తగా భాసిల్లిన కారణాన ఆ యోధాగ్రని స్మృత్యర్థం ఉగాది ఆచరింపబడుతున్నదని చారిత్రక వృత్తాంతం. ఏది ఏమైనా జడప్రాయమైన జగత్తులో చైతన్యాన్నిరగుల్కొల్పి మానవాళిలో నూతనాశయాలను అంకురింపచేసే శుభదినం 'ఒక్క తెలుగు సాంప్రదాయంలోనే కాక మరాఠీలు గుడి పడ్వాగానూ, తమిళులు పుత్తాండు అనే పేరుతో, మలయాళీలు విషు అనే పేరుతోను, సిక్కులు వైశాఖీగానూ, బెంగాలీలు పొయ్‌లా బైశాఖ్‌గానూ జరుపుకుంటారు. ప్రతి యుగానికి (యుగం) 60 సంవత్సరాల చక్రం ఉంటుంది. ఉగాది సంవత్సరంలోని ప్రతి సంవత్సరం జ్యోతిషశాస్త్ర ప్రభావాల ఆధారంగా పంచాంగంలో (ఖగోళ క్యాలెండర్) ఒక నిర్దిష్ట పేరును కలిగి ఉంటుంది. సంవత్సరం పేరు ఆ సంవత్సరం పాత్రను సూచిస్తుంది. క్యాలెండర్‌లో 60 సంవత్సరాల పేర్లు ఉన్నాయి. ప్రతి 60 సంవత్సరాలకు, ఒక పేరు చక్రం పూర్తవుతుంది. తదుపరి చక్రంలో పేర్లు పునరావృతమవుతాయి. ఉదాహరణకు, 1954 తెలుగు పేరు "జయ", 2014లో పునరావృతమైంది. ఉగాది అనేది వసంత ఋతువులో (సాధారణంగా మార్చి లేదా ఏప్రిల్ నెలలలో) వచ్చే తెలుగు నూతన సంవత్సర పండుగ. ఈ సంవత్సరం శ్రీ "క్రోధినామ సంవత్సరం" గా ఈ ఉగాది అలరించనున్నది. ప్రపంచంలోనే గాని, భారతదేశం ఏ ప్రాంతంలో నివాసమున్న హిందువులు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల్లోనివారు చైత్రమాసం కొత్తసంవత్సరం మొదటిరోజు ఉగాది పండుగగా జరుపుకుంటారు. హిందూ క్యాలెండర్ నెల చైత్రమాసం మొదటి రోజు మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో వస్తుంది. ఈ ఏడాది, ఏప్రిల్ 9వ తేదిన ఉగాది మంగళవా రం రావడం విశేషం.

## శ్రీ క్రోధినామ సంవత్సరం ఫలితం:

శ్రీ 'క్రోధినామ', ఈ "ఉగాది ఫలవంతం". తెలుగు సంవత్సరాలలో 38వ సంవత్సరం, జ్యోతిష్యశాస్త్ర ప్రకారముగా చూసినప్పుడు, కొత్త ఆశలను మోసుకొస్తూన్న 'ఉగాది'. శ్రీ 'క్రోధినామ' సంవత్సరానికి స్వాగతం, సుస్వాగతమంటూ...నీ



రాక శ్రీకరం, శుభకరం... నీ రాకను ఈశ్వరానుగ్రహముగా తలచి, రాబోతున్న ఏడాది కాలానికి కష్టసుఖా లకు నిలబడి, వేటినయినా శ్రీ క్రోధినామ' 'ఉగాది' అందరి కోరికల్ని తీర్చేందుకు, ఏడాది పొడుగునా జీవితంలో చవిచూసే అనుభవాలకు తార్కాణంగా, షడ్రుచుల సమ్మేళనంగా ఉగాది పచ్చడిని సేవించడం తెలుగు వారి ఆనవాయితీగా బెల్లం – తీపి ఆనందానికి సంకేతంగా, ఉప్పు – జీవితంలో ఉత్సాహంగా ఉండేందుకు, వేప పువ్వు- చేదు జీవితంలో ఎదుర్కొనే భాధలకు సంకేతంగా, చింతపండు – పులుపు నేర్పుతో చాకచక్యంగా వ్యవహరించవలసిన పరిస్థితులను తట్టుకుని నిలబడే ఆత్మస్థైర్యాన్ని, పచ్చిమామిడి ముక్కలు – వగరు కొత్త సవాళ్ళ ఎదుర్కోగలగటం, కారం – సహనం కోల్పోయేలా చేసే పరిస్థితులు నివారించే గుణాది విశేషాలు కలగలిపిన షడ్రుచుల శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పండుగ రోజున ఉగాది పచ్చడిని సేవించడం ద్వారా క్రోధినామ ఉగాదిని ఫలవంతం చేసుకోవడం శ్రేయస్కరం మంటున్నారు జ్యోతిష్య పండితులు.

## ఉగాది పచ్చడి :

ఉగాది పచ్చడి తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు కలసిన షడ్రుచుల సమ్మేళనం. సంవత్సరం పొడుగునా ఎదురయ్యేమంచి చెడులను, కష్టసుఖాలను సంయమనంతో స్వీకరించాలన్నసందేశాన్నిఈ పచ్చడి ఇస్తుంది.

## ఉగాది పచ్చడికి కావలసిన పదార్థాలు:

1. మామిడికాయ-1 (ఓ మాదిరిపరిమాణం కలది)- 2. వేప పువ్వు- 1/2 కప్పు, సన్నగా తరిగిన 3. కొత్తచింతపండు-100 గ్రాములు, 4. కొత్తబెల్లం-100 గ్రాములు, 5. పచ్చిమిరపకాయలు, 6. ఉప్పు సరిపడేంత కొన్నినీళ్లు, వీటితోపాటు వారి వారి ఇష్టానుసారం కొబ్బరిముక్కలు-1/2 కప్పు, అరటిపండు-1,చెరకురసం-1/2 కప్పు, అరటిపళ్లు, జామకాయలు, ద్రాక్ష పండ్లు ఇంకా జీడిపప్పులు, కిస్మిస్, బాదం మొదలగు డ్రై ఫ్రూట్స్ కూడా వేసుకోవడంతో రుచి మరింత పెరుగుతుందనుకుంటూ యువత నేటితరం పిల్లలు జోడించి తాయారు చేసుకుంటున్న వైనం గమనార్హం.

తయారీ విధానం: (ఒక్కొక్కరు, వారి ఇంటి సంప్రదాయానుసారంగా తయారు చేసుకుని సేవించడం ఆనవాయితీ) ఉగాది పచ్చడి తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు కలసిన షడ్రుచుల సమ్మేళనం. సంవత్సరం పొడుగునా ఎదురయ్యేమంచి చెడులను, కష్టసుఖాలను సంయమనంతో స్వీకరించాలన్నసందేశాన్నిఈ పచ్చడి ఇస్తుంది. ఈ పచ్చడి కొరకుచెఱకురసం, అరటి పళ్లు, మామిడి కాయలు, వేప పువ్వు, చింతపండు, జామకాయలు, బెల్లంమొదలైనవి వాడుతారు. ముందుగా వేపపువ్వును కాడల నుంచి వేరుచేసి పెట్టుకోవాలి. చింతపండులో కొద్దిగా నీళ్లు పోసి నానబెట్టి పది నిమిషాల తర్వాత దాని గుజ్జును వేరుచేయాలి. మామిడికాయను, మిరపకాయలు, కొబ్బరినిసన్నగా తరగాలి. తర్వాత చెరకురసం సిద్ధంచేసి, మిగతా పళ్లను వాటినికూడా సన్నగా తరిగి పెట్టుకోవాలి. బెల్లాన్నికూడా తురిమి పెట్టుకొనిదాన్నిచింతపండు గుజ్జులో కలపాలి. ఈ మిశ్రమంలో మామిడి కాయ ముక్కలు, తరిగిన కొబ్బరి, మిరపకాయ ముక్కలను వేసి చివరిగా ఒక అర స్పూను ఉప్పువేసి కలుపుకోవాలి. అంతే షడ్రుచుల ఉగాది పచ్చడి సిద్ధమైపోయినట్టే. ఇక వసంత లక్ష్మీని ఆహ్వానించి, నైవేద్యంగా సమర్పించి, తర్వాత స్వీకరించాలి. అంతేకాదు మిగతా వాళ్లకు అందజేయండి. కష్టసుఖాలను జీవితంలో చవిచూడాలనే నిజాన్నిఉగాది పచ్చడి సేవనం తెలియజేస్తుంది. ఆ ఉగాది పచ్చడిసేవనం ద్వారా లభించే పోషకాలు, కేలరీలు తెలుసుకుందాం.

## పోషకాలు(1 కప్పు- 200 గ్రాములు):

కేలరీలు: 201 కిలో కేలరీలు ఎ కార్బోహైడ్రేట్లు: 6.9 గ్రా ఎ ప్రోటీన్: 8.2 గ్రా ఎ కొవ్వు: 16 గ్రా ఎ సంతృప్తకొవ్వు: 8.6 గ్రా ఎ కొలెస్ట్రాల్: 41 మి.గ్రా ఎ సోడియం: 503 మి.గ్రా ఎ పొటాషియం: 291 మి.గ్రా ఎ ఫైబర్: 1.6 గ్రా ఎ చక్కెర: 3.7 గ్రా ఎ విటమిన్ ఎ: 8% ఎ విటమిన్ సి: 8% ఎ కాల్షియం: 10% ఎ ఇనుము: 4%

## ఆయుర్వేద ఆరోగ్య నిపుణల హితోక్తి :

గతంలో యావత్ ప్రపంచాన్ని గడగడ లాడించిన మహమ్మారి "కరోనా " వైరస్ ప్రభావం భారతదేశంలో, అంత ప్రభావం లేకపోవడానికి కారణం పరిశోధనలు జరిపిన విదేశసంస్థలు భారతీయులు పాటించే ఔషధ విలువలు తెలుసుకున్నారని బోగట్టా. నాడు భారతీయులను సనాతన సంప్రదాయాలంటూ, విమర్శలు గుప్పించిన వారే, నేడు భారతీయుల పండుగలు, తద్వారా పాటించే ఆయుర్వేద ఔషధ విలువలకు అబ్బురపడుతూ, మేము సైతం అంటూ, షడ్రుచులతో తయారుచేసిన ఉగాది పచ్చడిని, సేవించడానికి ఆసక్తి చూపడం గమనార్హం.

## పంచాంగ శ్రవణం:

ఇక ఉగాది రోజు మూడవ ముఖ్యమైన అంశంగా, ఆచరణాత్మకమైనది. "పంచాంగ శ్రవణం". ఉగాది రోజు దేవాలయంలోగానీ, గ్రామ చావడిలోగానీ, కూడలిలోగానీ, ఇంట్లో అయితే యజమానే స్వయంగా, పంచాంగ శ్రవణాన్ని చేయడం ఆచారం. 'పంచాంగం' అంటే ఇదు అంగాలని అర్థం. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనేవి ఆ ఐదు అంగాలు! ఈ ఐదింటితో కూడిన "పంచాంగాన్ని – ఉగాది రోజున వివిధ దేవతలతోపాటు పూజించి, పంచాంగ శ్రవణం చేయాలి. "పంచాంగ శ్రవణం' చేసేటప్పుడు ఉత్తరాభిముఖంగా కూర్చుని వింటే మంచిదని పండితులు చెబుతుంటారు. "పంచాంగ శ్రవణం' చేసినవారికీ, విన్న వారికీ కూడా సూర్యుడు శౌర్యాన్ని, తేజస్సునీ, చంద్రుడి వైభవాన్నీ, కుజుడు సర్వమంగళాలనూ, బుధుడు బుద్ధివికాసాన్నీ, గురుడు గురు కృపనూ, జ్ఞానాన్నీ, శుక్రుడు సుఖాన్నీ, శని దు:ఖరాహిత్యాన్నీ, రాహువువల్ల ప్రాబల్యం, కేతువు ప్రాధాన్యతా లభింపచేస్తారు. "పంచాంగ శ్రవణం'లో ముఖ్యంగా సంవత్సర ఫలితాలు తెలుసుకోవాలన్న ఆత్రుత ఎక్కువగా కనపడుతుంటుంది. ఈ ఉగాది క్రోధినామ తెలుగు సంవత్సరాలలో వచ్చే 38వ సంవత్సరంగాను, జ్యోతిష్య శాస్త్ర ప్రకారముగా చూసినప్పుడు, ఈ సంవత్సరంలో జన్మించిన వారు కళల్లో విశేషంగా రాణిస్తారని, సృజనశీలురై ఉంటారనీ, వివిధరకాల వస్తువుల్ని సేకరించే అలవాటు ఉంటుందనీ, నిరంతరం ఆలోచిస్తూ ఉంటారనీ, స్నేహంపట్ల విశ్వాసం, ధైర్యముతో పనులు చక్కపెడతారని, అన్ని నక్షత్రాల వారికీ ఫలవంతంగా ఉంటుందని శాస్త్రం ఘోషిస్తోంది. సంవత్సంపరంగా చూసుకున్నప్పుడు ఈ సంవత్సరంనకు కళలు, సృజనాత్మక శక్తి, రచయితలకు కళాకారులకు మంచి స్ఫూర్తిదాయకమైనది.

## కవులకు విందు పసందు :

కవులు-కవయిత్రుల కవి సమ్మేళన సందళ్ళ సంరంభం. కవుల వర్ణనలో వసంత రుతు శోభను వర్ణిస్తూ 'క్రొత్తగా జతకట్టిన కోకిలమ్మ పెంటికై నూత్న యౌవనోద్వేగ వేగి యగుచు, ముక్కున చిదుమని ఆమ్ర కిసలయమ్ము లేదు వసంత వనాంత వీధి' అంటూ మావిలే చిగుళ్ల మాధుర్యాన్ని ప్రస్తుతించారు. బమ్మెర పోతనదీ అదే దారి- 'బాలరసాల సాల నవపల్లవ కోమల కావ్య కన్యక'గా తన భాగవతాన్ని భావన చేశాడు. ఎండలకు తట్టుకోలేనప్పుడల్లా వేసవిని తిట్టుకుంటాం గాని, గ్రీష్మం అంటే 'ఆమ్ర ఫలముల నందించు అమృత రుతువు' అన్నది రసజ్ఞుల భావన. మామిడి పళ్లు, మల్లెపూలు – వేసవిని ఇష్టపడేలా చేయడానికి! చూతం, ఆమ్రఫలం, రసాలం – పేరేదైతేనేం, మామిడిపండు రుచి రాజన మాధుర్యం. కనుకనే దాన్ని 'ఫలరాజం'గా పిలుస్తారు. ఫలం అనే మాటకు కాయ, పండు అని రెండు అర్థాలున్నాయి. కొన్ని కాయలే బాగుంటాయి, మరికొన్ని పళ్లుగా బాగుంటాయి. కాయగానూ, పండుగానూ మామిడిది రాచఠీవి. 'పచ్చిదైన గాని పక్వమొందిన గాని చూతఫలము చూడ జాతి ఘనము' అని లోకంలో ప్రసిద్ధి. అంతేకాదు, మరో ప్రత్యేకతా ఉంది. 'మహిని రాజఫలము మాకంద ఫలమేను – తీపి, పులుపు దాని తీరు చూడ' అన్నారొక అవధాని. వసంతకోయిల శ్రావ్యంగా కూయాల న్నా, ఆమ్ర కిసలయమే (లేత చిగురు) దానికి అనువైన ఆదరువు. ఇంతటి మహోన్నతమైన శ్రీ క్రోధినామ ఉగాదికి నా చిరు కవితను అందిస్తూ...

చల్లగ, మెల్లగ వీచే, శీతల సమీరాలకు దర్పణం.మధుర, మకరంద, రసపాన, మధుపమ్ములకులలిత, లాస్య, మయూర, విలాస గతులకు, నిదర్శనం.సరస కోమల, కిసలయ విన్యాసాలకు కోకిల కాకలీ, కుహూ.. కుహూ.. రవాలకు, ప్రదర్శనం. అంబర చుంబి, కదంబ హరిత వనాలకు, సచేతనం కోకిల కూజితాలు, మల్లెల పరిమళాలు...... తెలుగింటి సంస్కృతి, సంప్రదాయాల పంచాంగ శ్రవణాలు, వీనులవిందైన కవుల/కవయిత్రుల కవిసమ్మేళనాలు వెరసి... శ్రీ క్రోధినామ ఉగాదీ పండుగ సంబరాలు

శ్రీ క్రోధినామ ఉగాది సంవత్సరం – ఎల్లరుకు "ఫలవంతం" కావాలి.


సర్వే జనాః సుఖినో భవంతు.



-శారదా శృంగేరి
94902 61119

## ఓ నవ వసంతమా !


కాలం పుట్టినరోజు ఉగాది
కాలం ప్రాణుల పుట్టుకల పునాది
ప్రకృతి పండుగ ఉగాది
షడ్రుచులు జీవిత పరమావధి తెలిపేది
బావి బ్రతుకు ఫలాల పంచాంగ పటణం
కొత్త చిగురుల కొత్త ఆశల కొత్తదనం
క్యాలెండర్లు మారడం మనకు కొత్త
కాలం ఎప్పుడూ కొత్తదే!
కాల గమనంలో జీవుల బ్రతుకులు
గీరలు లేని రథంపై భ్రమణాలై
క్షణం క్షణం అనుక్షణం
సెకండ్లు నిమిషాలు గంటలు
తిథి వార నక్షత్రాలు ఋతువులు
సంవత్సరాలు ఉగాదులై ,ఉగాదులు
యుగాలు కల్పాలై కదిలిపోతుంటాయి
ఓ నవ వసంత ఉగాది!
నీ రాక ఆనందంతో వెలుగు తెలుగు లోగిల్లు
ఇంటింటా షడ్రుచుల పచ్చళ్ళు
ఆడ పిల్ల పుట్టింటికి వచ్చినంత సంబురం
అది ప్రకృతికి వసంతమే,
మాకు ఉగాది సంబరం
పచ్చగ పరిమళాల పువ్వులతో ప్రకృతి శోభ
గ్రీష్మంలో అయినా చల్లని ప్రకృతి ప్రభ
ఓ నవవసంతమా నీకు స్వాగతం !
ఆ కొమ్మలకు ఎవరు చెప్పిరి ఇది శిశిరమని
ఆకులు రాల్చి చిగురులు తొడుగుమని
ఆ కోయిలలకు ఎవరు నేర్పిరి
తీయగా కుహూ కుహూ కూయమని
ఓం నవ వసంత ఉగాది
నీ రాకే కదా ఈ ప్రకృతి సోయగం
(క్రోది నామ ఉగాది సందర్భంగా)



-పి.బక్కారెడ్డి
9705315250

## ఓ క్రోదినామ సంవత్సరమా..!

ఓ క్రోదినామ సంవత్సరమా
నీ పేరులోనే ఉందమ్మా కోపం
మా పైన చూపకు నీ ప్రతాపం.
రెక్కాడితే గాని డొక్కాడని బక్క చిక్కిన
శ్రామికుడున్నాడు ఈ లోకంలో
ఆరుగాలం చెమటోడ్చి జగతికి జాబిల్లి లాంటి
అన్నం ముద్దపెట్టే రైతున్నాడు ఈ సమాజంలో
మా పైన చూపకు నీ ప్రతాపం.
రంగురంగుల బంగారు కలలు గని భవిష్యత్తుకు
బాటలు వేసే విద్యార్థి లోకం ఉన్న ఈ కాలంలో
ఆకాశంలో సగం సమాజానికి
ఒక బలం తమ గళం విప్పుతున్న
నారీశక్తి మని ఉన్న ఈ ఇలలో
మా పైన చూపకు నీ ప్రతాపం
నోరు లేని జీవులు మూగబోయిన గొంతుకలు
గోదా గొడ్డులు పశుపక్షాదులు క్రిమి కీటకాలు
ఎన్నో జీవులు బ్రతుకు పోరాటం చేస్తున్న
ఈ అవని పైన గుక్కెడు
నీళ్ల కోసమే గుప్పెడు గింజల కోసమే
మా పైన చూపకు నీ ప్రతాపం!
క్రోదినామ సంవత్సరమా!!



-నాగం సాయిలు
9490209037

## 'క్రోధి' క్రోధం

అవినీతిపరుల్ని చీల్చి చెండాడడానికి..
అశ్లీల మృగాళ్ళను అంతం చేయడానికి..
దురాలోచనల్ని కట్టడి చేయడానికి?
అనైతిక పోకడల్ని అడ్డుకోవడానికి..
ప్రకృతి విధ్వంస రెక్కల్ని నరికేయడానికి..
లంచగొండుల లాగులూడదీయడానికి..
అబద్ధాలకోరుల విషం కక్కించడానికి..
కాలుష్యకారుల కాళ్లను కట్టేయడానికి..
కల్తీరాయుళ్లకు బేడీలు వేయడానికి..
వెన్నుపోటుదారుల్ని వేటాడడానికి..
ఈర్ష్యాద్వేశాల్ని ఈడ్చిపారేయడానికి..
రక్తం పీల్చే జలగల్ని రఫ్ఫాడించడానికి..
దుష్టశక్తుల్ని తన్ని తరిమేయడానికి..
రాజకీయ రాక్షసుల్ని రచ్చకీడ్చడానికి..
డబ్బున్న బిచ్చగాళ్ల పీచమణచడానికి..
పన్ను ఎగవేతదారుల పంతం పట్టడానికి..
సైబర్ మోసగాళ్లపై కత్తి దూసేయడానికి..
చొరబాటుదారుల తల నరకేయడానికి..
చావు తెలివిగాండ్ల చాపచుట్టేయడానికి..
బొక్కసాన్ని బుక్కే ఎలుకల్ని ఏరేయడానికి..
'క్రోధి' వత్సరం క్రోధంతో ఊగి తూగుతూ..
విశ్వ శాంతి,
విజ్ఞాన దీపాల్ని వెలిగించాలె !



– మధుపాళీ
9949700037

## ఆశల తోరణాలు

కొన్ని ఆశల తోరణాలు
బ్రతుకు గుమ్మానికి తగిలించి
ఎదురుచూస్తున్నా...
నేను కన్న కలలు కొన్నైనా
నిజాలై నిలిచిపోవాలని....
నిత్యం సాటివారిని చులకన
చేస్తూ తనువంతా అహంకారం
నింపుకున్న మనిషి.....
అహాన్ని చంపుకొని...
మానవత్వాన్ని పెంచుకుని
మమకారపు మధురిమలు
పంచుతూ మనగలగాలని...
విరిసే పసి మొగ్గలను
విచ్చుకోకముందే కర్కషంగా
చిదిమేసే మదాంధుల మదిలో
చిన్నారులపై చెడు తలంపు లేని
స్వచ్ఛమైన ప్రేమానురాగాలు
చిగురించాలని.....
జన్మనిచ్చిన తల్లిదండ్రుల
వృద్ధాప్యాన్ని చీదరించుకుంటూ
బలవంతపు వానప్రస్థానానికి
సాగనంపే కన్నపిల్లలు....
కన్నవాళ్లను కంటిపాపలుగా
కాపాడుకునే రోజులు రావాలని...
మతోన్మాదులు సృష్టించే
విద్వేషపు జ్వాలల్లో
శలభాలై మగ్గిపోకుండా....
సమ సమాజ నిర్మాణంలో
ప్రతీ పౌరుడు
సౌభ్రాతృత్వపు పూలు
పూయించాలని
మనసారా ఆకాంక్షిస్తున్నా....



-కళావతి కందగట్ల
9948263004

## ఉగాదీ! శుభస్వాగతంబు!

సీ॥ అత్త వారింటిలో అప్పుడే అడుగు మోపిన క్రొత్త కోడలు పిల్ల వోలె!
పలు సమస్యల ప్రశ్నపత్రమున్ ప్రజకిడ-చేరు పరీక్షాధికారి వోలె
ఎన్నో కలల్ తీర ఎన్నికలన్ గెల్చి అరుదెంచు మంచి నాయకుని వోలె,
క్లైమాక్సు-సస్పెన్సు-హ్యూమరు-థ్రిల్ విడుదల యగు హిట్టు పిక్చరు వలె

సార్థకవు కాక-అమాయకస్పర్థనిడక
సకల సమ ధర్మ దర్శనస్పందనమున
బహికాముష్మిక ఫలాలనందజేయ
రాగదే! ఉగాదీ! శుభస్వాగతంబు!!



-డా॥ రామడుగు వెంకటేశ్వర శర్మ
సెల్: 9866944287

## ఇది రాజకీయ క్రోధి...



ఒకనాడు సృష్టి ఆది పునాది ఉగాది
ఈనాడు రాజకీయం అధికారమందే పునాది క్రోధి...

ఒకనాడు బ్రహ్మ సృష్టి ప్రారంభం ఉగాది
ఈనాడు రాజకీయ ఎత్తుగడల ప్రారంభం క్రోధి...

ఒకనాడు కోకిలల తీయటి రాగం ఉగాది
ఈనాడు మైకుల మాటల రాగం క్రోధి...

ఒకనాడు బంధుజనులు తోబుట్టుల ముచ్చట్ల మామిడి తోరణం ఉగాది
ఈనాడు ఆ వర్గం ఈ వర్గం జనులు రాజకీయ అభిప్రాయ ముచ్చట్లు క్రోధి...

ఒకనాడు సంస్కృతి సంప్రదాయాల సంబరం ఉగాది
ఈనాడు సర్వేల సందడి సంబరం క్రోధి...

ఒకనాడు కష్టసుఖాలకు తట్టుకుని నిలిచే షడ్రుచుల వంటకం ఉగాది
ఈనాడు కష్టసుఖాలకు మేమున్నామనే నాయకుల వాగ్దానాల వంటకం క్రోధి...

ఒకనాడు వాతావరణ స్థితిగతులు
పంటల స్థితిగతులు తెలిపే పంచాంగ శ్రవణం ఉగాది
ఈనాడు అధికార ప్రతిపక్షాల గెలుపు భజనబృందం క్రోధి...

ఒకనాడు కామక్రోధాలను త్రుంచే తత్వగుణం ఉగాది
ఈనాడు కామ క్రోధాలను పెంచే ఉచిత పథకాల ప్రచారం క్రోధి...

ఇప్పుడు వచ్చే ఉగాదే
ఈసారి రాజకీయ వేడిసోకీ క్రోధిగా మారింది...
ఈ క్రోధి పార్టీలకు కాకుండా
ప్రజలకు ఉగాది కావాలని కోరుకుంటూ
సమాజానికి క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు



-అభిరామ్
9704153642

## ఉగాది


నేడు ఆనందోదయం
కవి కళాదుల కల్పోదయం
వసంత ఋతువు ఆగమనపు
ఉగాది మహోదయం.

కోయిలల కుహు కుహు
రాగాలతో మది పరవశించే
మాసం ఈ మధుమాసం
నిండు ముత్తైదువలా
గున్నమావి కళకళ లాడే మాసం

తెలుగు లోగిళ్ళు సంద్రం అంత
సంబరాలు జరుపుకొనే ఉదయం
ఈ ఉగాది మహోదయం
తీపి,చేదు జ్ఞాపకాలతో
గడిచిన గత వత్సరానికి
వీడ్కోలు పలుకుతూ,
నూతన సంవత్సరాన్ని
స్వాగతించే ఉదయం.

ఊరు ,వాడా
మంగళకర మామిడి తోరణాలు
చలువ పందిళ్ళు,
పంచాంగ శ్రవణాలు.

పంచదార లాంటి తీపి
తీపి జ్ఞాపకాల
చిరు చిరు కష్టాల చేదు,
సంతోషం, దుఃఖం కలగలిపినట్లు
మామిడిపులుపుల షడ్రుచులలో
జీవితసారం
తెలిపే ఉగాది పచ్చడి
క్రోధినామ సంవత్సరమా !
కర్షక,వర్తక, విద్యా ,ఉద్యోగ,
వ్యాపారాలలో
అందరికీ
బంగారు భవితను ఇస్తావని
ఆశిస్తూ...



-మాధవి శ్రీనివాస్
నందిమళ్ళ

## క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం

స్వాగతం స్వాగతం
నవ యుగానికి స్వాగతం
యువ శకానికి స్వాగతం
నవ నవోన్నత వత్సరం
శ్రీ 'క్రోధి' కిదె నా స్వాగతం ॥స్వాగతం॥

మనుజులను రక్షింప నెంచగ
దనుజులను శిక్షింప బూని
మానవత్వం మహిని పెంచగ
దానవత్వం మదమడంచగ
వసుధపై ఉదయించనున్న
'క్రోధి' కిదె నా స్వాగతం ॥క్రోధి॥

దేశమంటే మట్టి కాదని
దేశమంటే మనుషులంటూ
ఎన్నడో గురజాడ చెప్పగ
మరిచిపోయిన మందమతులకు
బుద్ధి చెప్పగ భువికి రమ్మని
'క్రోధి' కిదె నా స్వాగతం ॥స్వాగతం॥

ఆడబిడ్డల జీవితాలతో
ఆడుకొను ఆంబోతులందరి
పీక నులిమి పీచమడచీ
అవనినేలే ఆదిశక్తిగ
అవతరించి ఆదుకొనుటకు
'క్రోధి' కిదె నా స్వాగతం॥స్వాగతం॥


ప్రజాస్వామ్యపు విలువలన్నీ
మచ్చుకు లేకుండ జేసి
స్వార్థ చింతన స్వప్రయోజన
మార్గమే తమ ధ్యేయమనెడి
అక్రమార్కులనణచి వేయగ
'క్రోధి' కిదె నా స్వాగతం ॥స్వాగతం॥
(క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకల సందర్భంగా)



-బండిరాజుల శంకర్
9948050608

## పండుగ

కోకిల గానం
షడ్రుచుల పానీయం
పంచాంగ శ్రవణం
క్రోధి సంవత్సరం
కష్టసుఖాల సారం
సూర్యోదయం
ఉగాది పబ్బం



-రేడియమ్
9291527757

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.